క్లుప్తంగా

ఆశీలు వసూలుకు వేలం

మండపేట: పురపాలక సంఘంలోని మార్కెట్లో ఆశీల వసూలు, వాటర్ వర్క్స్ పరిధిలోని చెట్ల ఫలసాయం, కబేళా నిర్వహణకు సంబంధించి మున్సిపల్ అధికారులు వేలం నిర్వహించారు. బుధవారం ఆయన చాంబర్లో కమిషనర్ రంగారావు ఆధ్వర్యంలో ఆర్వో జేవీఎస్ శాస్త్రి నిర్వహించిన వేలంలో పట్టణంలోని పలువురు పాటదారులు పాల్గొన్నారు. సర్దార్ వేగుళ్ల వీర్రాజు మార్కెట్, రోడ్డు మార్జిన్ ఆశీల వసూళ్లకు వేలం నిర్వహించగా చింతల శ్రీనివాస్ రూ.26.50 లక్షలకు పాట దక్కించుకున్నారు. మేకల కబేళా వేలంలో టీడీపీ మైనారిటీ సెల్ నాయకుడు, మాజీ కో– ఆప్షన్ సభ్యుడు ఎండీ అతావుర్ రెహ్మాన్ రూ.1.12 లక్షలకు పాటను దక్కించుకున్నారు. ఆర్ఐలు అందే శ్రీనివాస్, ఏజేఎస్ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్

రామచంద్రపురం: విద్యా శాఖ కమిషన్ ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అకడమిక్ ఆడిట్ నిర్వహించారు. కళాశాల విద్యాశాఖ నియమించిన రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల జియాలజీ అధ్యాపకుడు డాక్టర్ ఎంఆర్ గౌతమ్, పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్ వినారాయణరావులు అకడమిక్ అడ్వైజర్లుగా పాల్గొని కళాశాలలోని అధ్యాపకులందరి డిపార్టుమెంట్లకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శత వార్షికోత్సవ సన్నాహక సమావేశం

రామచంద్రపురం రూరల్: వేగాయమ్మపేట గ్రామంలోని మహాలక్ష్మమ్మ హిందూ ప్రభుత్వ ఉన్నత శత వార్షికోత్సవం పురస్కరించుకుని చేయాల్సిన ఏర్పాట్లపై గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. నిర్వహణ కమిటీ అధ్యక్షుడు గారపాటి విశ్వనాథం మాట్లాడుతూ 1928లో గ్రామానికి చెందిన రాజావాడ్రేవు విశ్వసుందరరావు తన తల్లి పేరు మీద గ్రామంలో మహాలక్ష్మమ్మ హిందూ ఎయిడెడ్ పాఠశాలను స్థాపించారన్నారు. ఘనత వహించిన ఈ పాఠశాల శత వార్షికోత్సవం వైభవంగా నిర్వహించాలని తీర్మానించారు. గారపాటి సూర్యసత్యనారాయణ, వేపూరి సాయిరాం, మద్దిపూడి శ్రీనివాస్, నండూరి సుబ్రహ్మణ్యం, దడాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కాజులూరు: గ్రామాల్లో తలెత్తిన ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం అన్నారు. గొల్లపాలెంలో అధికారులు, నాయకులు బుధవారం మన గ్రామం, మన మంత్రి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో కుళాయిల ద్వారా తాగునీరు అందడం లేదని మహిళలు ఆందోళన వ్యక్తం చేయగా సంబంధిత జేఈని పిలిచి వేసవి దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో సాగునీరు, డ్రైనేజీ నిర్మాణాలపైన రైతులు, స్థానికులు ఫిర్యాదులు చేశారు. స్థానిక నాయకులు అంగర కృష్ణ, శ్రీను, చిన్నా, గుబ్బల ఏసురాజు, డాక్టర్ చంద్రు వీర్రాజుచౌదరి, తోట కృష్ణ కోకా హరి పాల్గొన్నారు.

ఉత్తమ మార్కులు సాధించాలి

రాయవరం: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని పసలపూడి మోడల్ స్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రగతి రామారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి స్థానిక శ్రీసిటీలో నూతనంగా ప్రతిష్ఠించిన విద్యాగణపతి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రగతి రామారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. శ్రీసిటీ అధినేత తాడి శ్రీనివాసరెడ్డి, ప్రగతి రామారెడ్డి, పారిశ్రామికవేత్త రాయుడు రామకృష్ణ, కొవ్వూరి గోపాలరెడ్డి(గోపి) సౌజన్యంతో విద్యార్థులకు కావలసిన విద్యా సామగ్రిని అందజేశారు. పాఠశాల హెచ్ఎం నూలు సత్యనారాయణ, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, కొవ్వూరి భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

రాయవరం: వెదురుపాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 39 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ కొండిపూడి సత్యప్రభ సౌజన్యంతో పాఠశాల హెచ్ఎం పి.రాంబాబు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కొండిపూడి ఏసురత్నం, చంటిబాబు, బత్తుల శ్రీనివాసు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ

రామచంద్రపురం రూరల్: కాపవరం జెడ్పీ హైస్కూల్లో బుధవారం పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. అనంతరం పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ గీసాల రాంప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు విద్యార్థులను ఆశీర్వదించారు. మాజీ ఎంపీటీసీ శతకోటి శ్రీనివాస్ స్నేహితుడు నెలపర్తిపాడుకు చెందిన రాయుడు రామకృష్ణ విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. దాత రాయుడు రామకృష్ణ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ప్రతిభచూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తానని హామీఇచ్చారు. సర్పంచ్ యనమదల మంగాదేవి, ఎంపీటీసీ రెడ్నం సతీష్‌రావు, కొవ్వూరి గోపాల్‌రెడ్డి, హెచ్ఎం ముమ్మిడి సత్యనారాయణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజల గుండెచప్పుడు వైఎస్సార్ సీపీ

- సమస్యల పరిష్కారంలో ముందంజ
- కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్
- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం



రామచంద్రపురంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్



ద్రాక్షారామలో కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపిస్తున్న కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రామచంద్రపురం: సమస్యల పరిష్కారంలో ముందుంటూ రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన పార్టీ వైఎస్సార్ సీపీ అని ఆ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని గాంధీపేటలోని పార్టీ కార్యాలయం వద్ద బుధవారం వైఎస్సార్ సీపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ కార్యాలయంలో దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయం ఆవరణంలో వైఎస్సార్ సీపీ జెండాను సూర్యప్రకాశ్ ఆవిష్కరించారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ప్రజల కష్టాలను తీర్చేందుకు వారికి అండగా ఉండేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఆనాడు వైఎస్సార్ సీపీ ఆవిర్భవించిందన్నారు. పార్టీ పుట్టుకతోనే ఉద్యమాల పార్టీగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిందని, అనంతరం అధికారం చేపట్టిన తరువాత తాను ఇచ్చిన ఎన్నికల హామీలను పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నవరత్న పథకాలను తూచా తప్పకుండా అమలు చేశారన్నారు. దేశంలోనే మునుపెన్నడూ జరగని విధంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూటికి 90 శాతం అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను తూచా తప్పకుండా అమలు చేసిన రాష్ట్రంగా వైఎస్సార్ సీపీ దేశంలో ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణ పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్ మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవాని, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పండు గోవిందరాజు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఇంత సంతోషం, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో..

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ద్రాక్షారామ బోసుబొమ్మ సెంటర్ వద్ద సూర్యప్రకాశ్ కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ప్రజల మేలు కోసం పనిచేసే పార్టీగా వైఎస్సార్ సీపీకి ఉన్న మంచి పేరును మరింతగా నిలబెట్టే విధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలలతో మమేకమై పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశా నిర్దేశంలో ప్రజల సమస్యలపై పోరాటానికి ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలని కోరారు. అనంతరం జిల్లా కేంద్రంలో తలపెట్టిన యువత పోరు కార్యక్రమానికి మోటారు సైకిళ్లు, కార్లపై ర్యాలీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నిడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ శాకా బాబీ, సర్పంచ్‌లు అనిశెట్టి రామకృష్ణ, అంబటి తుకారం, ఎంపీటీసీలు తుమ్మూరి సుబ్బలక్ష్మి, సురుకుర్తి శ్రీరామకృష్ణ, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: గ్రామంలోని మెయిన్ సెంటర్లో బుధవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రామచంద్రపురం వైఎస్సార్ సీపీ కన్వీనర్ పిల్లి సూర్యప్రకాశ్, ఎంపీపీ పంపన నాగమణి, మాజీ ఎంపీపీ పెట్టా శ్రీనివాస్ తదితరులు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కన్వీనర్ పిల్లి సూర్యప్రకాశ్ మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ పేదల సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీని స్థాపించారన్నారు. ఐదేళ్ల పాలనలో పేదలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశారన్నారు. రానున్న కాలంలో పార్టీ మరింత బలపడి అధికారం సాధించేలా ప్రతి కార్యకర్త, నాయకులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. బీసీ నాయకులు పంపన సుబ్బారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, పలు గ్రామాల సర్పంచ్‌లు, అభిమానులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించిన చైర్‌పర్సన్ దుర్గారాణి, పట్టాభి



వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఏడిదలో పార్టీ జెండాను ఆవిష్కరించిన నాయకులు, కార్యకర్తలు



కపిలేశ్వరపురంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

ప్రజలకు అండగా నిలిచిన వైఎస్సార్ సీపీ

మండపేట నియోజకవర్గంలో వేడుకగా ఆవిర్భావ దినోత్సవం

మండపేట: ప్రజల పక్షాన అండగా నిలిచి పోరాటం సాగించే ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నేత వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి హామీల అమలులో దేశంలోనే తనకుంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భవిష్యత్తులో మళ్లీ అధికారం చేపట్టడం ఖాయమని ఉద్ఘాటించారు. రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణంలో జరుపుకుంటున్న వైఎస్సార్‌సీపీ 15 ఆవిర్భావ దినోత్సవాన్ని మండపేటలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శాసన మండలి సమావేశాలకు హాజరైన నేపథ్యంలో ఆయన ఆదేశాల మేరకు ఆ పార్టీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు ఆధ్వర్యంలో బుధవారం వేడుకగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విజయలక్ష్మి నగరంలోని పార్టీ కార్యాలయం వద్ద నాయకులతో కలిసి పట్టాభి పార్టీ జెండాను ఆవిష్కరించారు. దుర్గారాణితో కేక్ కటింగ్ చేయించి అభిమానులకు పంచారు. 2029లో రాబోయేది జగన్ ప్రభుత్వమేనన్నారు. చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ వైఎస్ జగన్ పాలనలో పేద బడుగు బలహీన వర్గాల ప్రజలందరికీ మేలు జరిగిందన్నారు. తొలుత రాజారత్న సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి కపిలేశ్వరపురం జెడ్పీటీసీ పుట్టపూడి వీర వెంకట సత్యనారాయణ (అబ్బు), ఎంపీపీలు మేడిశెట్టి సత్యవేణి, నౌడు వెంకటరమణ, కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, వైఎస్సార్ కౌన్సిలర్లు నీలం దుర్గమ్మ, జొన్నపల్లి విజయలక్ష్మి, పిల్లి శ్రీనివాస్, మారిశెట్టి సత్యనారాయణ, మెండు బాపిరాజు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కొప్పిరెడ్డి పద్మావతి, పెంకే వెంకట్రావు, కొడమంచిలి భాస్కరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు గారపాటి అశోక్, కురుపూడి రాంబాబు, పిల్లా వీరబాబు, సిరిపురపు శ్రీను, నక్కా సింహాచలం, పెంకే గంగాధర్, పలివెల మధు, పంపన పద్మారావు, తాతపూడి రాజేష్, అబ్బిరెడ్డి వీర్రాజు, పలివెల సుధాకర్, బొడ్డపాటి సురేష్‌కుమార్, సూరంపూడి సత్యప్రసాద్, ముక్కపాటి కోటేశ్వరరావు, జొన్నపల్లి సత్తిబాబు, వెలగల సత్యనారాయణ రెడ్డి, టేకుముడి శ్రీనివాస్, తణుకు అశోక్, శేకా సత్యనారాయణ, కోళ్ల శ్రీనివాస్, వైఎస్సార్ అభిమానులు, మూడు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏడిదలో ఘనంగా వేడుకలు

మండపేట: సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం తీసుకొచ్చి సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కష్టించి పని చేయాలని ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, కురుపూడి రాంబాబు కోరారు. వైఎస్సార్ సీపీ 15వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని ఏడిదలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాధ్యక్షుడు పలివెల సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ముఖ్య అతిథిలుగా పాల్గొని బల్లగేటు సెంటర్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండపేట నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగుర వేస్తామని వారన్నారు.అనంతరం కార్యకర్తలకు, అభిమానులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ పటాన్ల నాగబాబు, తాతపూడి ఉషా రాజేష్, చొల్లంగి రామారావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి శ్రీహరి, వార్డు సభ్యులు వాసిరెడ్డి అర్జున్, కొండేటి కాశీకృష్ణ, ముగ్గుళ్ల పార్థుకృష్ణ, పితాని నారాయణరావు, పామిడిపల్లి నానాజీ, తాతపూడి రాజు, పరమటి శివ పాల్గొన్నారు.

రెపరెపలాడిన వైఎస్సార్ సీపీ జెండా

కపిలేశ్వరపురం: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం మండపేట నియోజకవర్గంలో ఘనంగా జరుపుకున్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పిలుపునందుకుని నియోజకవర్గ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పర్యవేక్షణలో మండపేట పట్టణం, మండపేట రూరల్ మండలంలోని 12 గ్రామాలు, కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాలు, రాయవరం మండలంలోని 12 గ్రామాల్లో పార్టీ జెండాలను ఎగురవేసి సంబరాలను జరుపుకున్నారు. కపిలేశ్వరపురం మండలంలోని అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, తాతపూడి, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, వడ్లమూరు, నిడసనమెట్ట, అచ్యుతాపురం, కాలేరు, నల్లూరు, టేకి, మాచర, కోరుమిల్లి, నాగులచెరువులు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంకలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆవిర్భావ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి మాట్లాడుతూ 15 ఏళ్ల పార్టీ ప్రస్థానాన్ని వివరించారు. ఎంపీటీసీ సభ్యులు పలివెల మధు, యర్రంశెట్టి నాగేశ్వరరావు, సర్పంచ్‌లు కుక్కల కుక్కల వీరన్న, నాయకులు పసలపూడి శ్రీనివాస్, పాలింగి కిశోర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వంతెనపై ఇసుక లారీల రాకపోకలు అడ్డగింపు



కపిలేశ్వరపురం వంతెనపై అడ్డుపెట్టిన దృశ్యం



దెబ్బతిన్న వంతెన అడుగు భాగం

కపిలేశ్వరపురం: కూటమి ప్రభుత్వంలో విచ్చలవిడిగా ఇసుక రవాణా జరుగుతుంది. కపిలేశ్వరపురం, తాతపూడి ర్యాంపుల నుంచి పరిమితి లేకుండా భారీ వాహనాల్లో ఇసుకను సమీప గ్రామాల మీదుగా ఇసుకను తరలిస్తున్నారు. రోజు రోజుకూ రవాణా తీవ్రత పెరుగుతుండటంతో గ్రామాల వీధుల్లో వాహనాల తాకిడి అధికమైంది. రహదారులు ఛిద్రం కావడంతో పాటు వంతెనలు దెబ్బతినే పరిస్థితులు నెలకొన్నాయి. మండల కేంద్రమైన కపిలేశ్వరపురం పంట కాలువపై ఉన్న వంతెన మీదుగా రోజూ భారీ ఇసుక వాహనాలు రాకపోకలు సాగించడాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. మంగళ, బుధవారాల్లో వంతెనపై వాహనాలు వెళ్లకుండా దుంగ, తోపుడు బండిని అడ్డుగా పెట్టారు. ఉన్నతాధికారులు స్పందించి వంతెన మీదుగా వాహనాల రాకపోకలను నిలువరింపజేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థి స్థాయి ఆధారంగా పాఠ్యాంశాలు బోధించాలి

రాయవరం: ఉపాధ్యాయులు విద్యార్థుల స్థాయి ఆధారంగా పాఠ్యాంశాలను బోధించాలని ఎంఈవో–2 వై.సూర్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని రాయవరం, పసలపూడి, చెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు మెరుగైన బోధనా పద్ధతులను అలవర్చుకుని, విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీని సమర్థవంతంగా బోధన చేయాలన్నారు. టీఎల్ఎం వినియోగానికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఆన్‌లైన్ సెషన్స్ ఆధారంగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఎంఈవో కొండారెడ్డి, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎంలు, సీఆర్ఎంటీలు వై.లక్ష్మీవీర్రాజు, కుంచె సీనాసిరి, వాసంశెట్టి సీతాధనలక్ష్మి, కిలపర్తి పోసిరాములు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు

రాయవరం: జిల్లా వ్యాప్తంగా బుధవారం క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ సమావేశాలను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 87 క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు ఆయా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో చేపట్టారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను పర్యవేక్షించారు. సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు, జిల్లా రామచంద్రపురం, అమలాపురం ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈవోలు సమావేశాలను సందర్శించారు.

కుటుంబ గొప్పదనాన్ని తెలియజేయాలి

రామచంద్రపురం: నేటి తరానికి కుటుంబ గొప్పదనాన్ని తెలియజేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని శ్రీచైతన్య మండపేట రీజినల్ ఇంచార్జ్ ఎం.లక్ష్మీనరేష్ అన్నారు. పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఫ్యామిలీ బ్లూమ్ అనే కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.రాము అధ్యక్షత వహించి మాట్లాడుతూ నేటి సమాజంలో కుటుంబ వ్యవస్థ గొప్పదనాన్ని కుటుంబ సంబంధ బాంధవ్యాలను, తల్లిదండ్రులు, పెద్దలకు మనం ఇవ్వాల్సిన గౌరవ, మర్యాదలను తెలియజెప్పే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఏర్పాటు చేసిన ప్రత్యేక సభకు విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించి, విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాద పూజ చేసి సత్కరించి, తల్లిదండ్రుల గొప్పదనాన్ని వాళ్ల మాటల్లో తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లక్ష్మీనరేష్ మాట్లాడుతూ తల్లిదండ్రుల మీద భక్తి గౌరవం పెద్దవారిపై ప్రేమ, అభిమానం కుటుంబ గొప్పతనం తెలియజేయడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో సోమవారం అర్ధరాత్రి మైనార్టీ నాయకుడు ఎండీ జాఫర్ హుస్సేన్ ఇంటిపై పేలుడు పదార్థాలతో దాడి చేసిన సంఘటనకు సంబంధించి ముగ్గురు నిందితులను అదుపులోనికి తీసుకున్నట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం. లక్ష్మణ్ బుధవారం విలేకరులకు తెలిపారు. తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు వెలంపాలెం రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్న పేలుడు కలకలం కారకులైన నిందితులు వెంకటాయపాలెం శివారు బొడ్డువారిపేటకు చెందిన పోతురాజు వినీల్‌కుమార్, మరో ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకుని వినీల్‌కుమార్‌ను రిమాండ్‌కు తరలించి, ఇద్దరు మైనర్లను జువెనైల్ జస్టిస్ బోర్డు ముందు హాజరు పరిచినట్లు తెలిపారు.

యువతకు బాసటగా పోరు



అమలాపురంలో చేపట్టే యువత పోరు కార్యక్రమానికి బైక్ ర్యాలీలో పార్టీ నేతలతో కలసి వెళుతున్న సూర్యప్రకాశ్



కలెక్టరేట్ వద్ద ఎన్నికల హామీలు అమలు చేయాలని నినదిస్తున్న నాయకులు



అమలాపురానికి తరలివెళుతున్న కపిలేశ్వరపురం మండల ప్రజలు

అమలాపురానికి తరలివెళ్లిన నాయకులు

కపిలేశ్వరపురం: ఎన్నికల ప్రచారంలో నోటికొచ్చిన హామీలిచ్చారు. ప్రజాపక్షం వహిస్తూ సంక్షేమ పాలననందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు కూటమికట్టి దుష్ప్రచాలకు దిగారు. అధికారంలోకి తామొస్తే ప్రతి ఇంటికీ ఒక ఉద్యోగం ఇస్తామని, ఎంత మంది పిల్లలు చదువుతున్నా రూ.20 వేలు చొప్పున సాయమందిస్తామని, రైతుకు రూ.20వేలు ఇస్తామనీ, ఉపాధ్యాయ, పోలీస్ తదితర ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామని ఇలా నోటికొచ్చిన హామీలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఎప్పుడూ ఇచ్చే సామాజిక పింఛన్లు తప్ప మిగిలిన హామీలేవీ అమలు చేయలేదు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్రజాపక్షం వహిస్తున్న వైఎస్సార్‌సీపీ యువతపోరు పేరుతో ఆందోళనకు పిలుపునిచ్చింది. మండపేట నియోజకవర్గంలోని మండపేట పట్టణం, రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలంలోని 43 గ్రామాల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. అమలాపురంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి విద్యార్థి, యువతీ యువకులు తరలివెళ్లారు. సంఘీభావంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కపిలేశ్వరపురం, తాతపూడి, అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, వడ్లమూరు, అచ్యుతాపురం, నిడసనమెట్ట, కాలేరు, నల్లూరు, టేకి, మాచర, కోరుమిల్లి, నాగులచెరువు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల నుంచి వాహనాలపై వెళ్లారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ నక్కా సింహాచలం, నాయకులు ఏలేటి గంగరాజు, వంగా శ్రీనివాస్, జిత్తుక సూరిబాబు, కట్టా మురళి, పిప్పర సంపతరావు, మరివాడ సూరిబాబు, ముత్యాల సతీష్, బొక్కా రాంబాబు, రెడ్డి రుద్రమూర్తి, రుద్రాక్షుల శ్రీనివాస్, పోలిశెట్టి గణేష్ పాల్గొన్నారు.

అమలాపురం తరలివెళ్లిన మండపేట నాయకులు

మండపేట: నిరుద్యోగులు, విద్యార్థి లోకానికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్న డిమాండ్‌తో యువత పోరు నినాదంతో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన పిలుపు మేరకు మండపేట నుంచి అమలాపురం భారీగా తరలివెళ్లారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అబ్బిరెడ్డి వీర్రాజు సారథ్యంలో బుధవారం విజయలక్ష్మి నగర్లోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి విద్యార్థులు, నిరుద్యోగులు, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. తొలుత కార్యాలయం వద్ద నిర్వహించిన ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొని అనంతరం కార్లలోను, బైక్‌లపైనా ర్యాలీగా వెళ్లారు. అమలాపురం కలెక్టరేట్ వద్ద అక్కడి నాయకులతో కలిసి ఆందోళనలో పాల్గొన్నారు. ర్యాలీలో ఎంపీపీలు నౌడు వెంకటరమణ, మేడిశెట్టి సత్యవేణి, పలివెల సుధాకర్, నక్కా సింహాచలం, సిరిపురపు శ్రీనివాస్, జొన్నపల్లి సత్తిబాబు, కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, యర్రగుంట అయ్యప్ప, ఎంపీటీసీ పలివెల మధు, కుడుపూడి రాంబాబు, కట్టా మురళి, యరమాటి వెంకన్నబాబు, సాధనాల శివ, పోలిశెట్టి గణేశ్, జుత్తుగ సూరిబాబు, కోనాల చంద్రబోస్, బేబీ కేథార్‌నాథ్ ఉన్నారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నేతలు, శ్రేణులు, విద్యార్థులు, అమలాపురంలో బుధవారం నిర్వహించిన యువత పోరుకు భారీగా తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, జిల్లా యువత అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ నేతృత్వంలో పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీగా అమలాపురం తరలివెళ్లారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు దాటినా ఇచ్చిన హామీల్లో యువతకు నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో చెల్లించని కారణంగా పార్టీ ఆధ్వర్యంలో యువత పోరు కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, ప్రజల నుంచి మంచి స్పందన వచ్చి అమలాపురంలో జరిగే కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమానికి రామచంద్రపురం నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ ర్యాలీలో పాల్గొన్నారు.